



నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం

- 14 వరకు దరఖాస్తులకు అవకాశం
- ఎంపీడీవో కార్యాలయాల్లోనూ స్వీకరణ
- లబ్ధిదారుల ఎంపికకు కలెక్టర్ అధ్యక్షతన కమిటీ

వాంకిడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, ఎంబీసీ తదితర అన్ని వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పేరిట రుణ సౌకర్యం కల్పించనుంది. దరఖాస్తు చేసు కునేందుకు ఈ నెల 14 వరకు గడువు పొడిగించింది.

దరఖాస్తుల స్వీకరణ, వడపోతకు..

దరఖాస్తుల స్వీకరణ, వడపోత తదితరాల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆదనపు కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ, ఎస్సీ, ఎస్టీ బీసీ శాఖల వారీగా జిల్లా సంక్షేమాధికారులు తదితరులు సభ్యులుగా ఉన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యాక మొదట ఎంపీడీవో స్థాయిలో స్క్రూటినీ చేసి కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన వారి తుది జాబితా రూపొందిస్తారు. అనంతరం ప్రభుత్వానికి నివేదించి ఆమోదం పొందిన తరువాత చివరగా జూన్ 2 నుంచి 9 వరకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తారు. వీటి ఆధారంగా బ్యాంకులు లింకేజీ ద్వారా రుణాలు అందజేస్తారు.

అర్హతలు..ధ్రువపత్రాలు

గ్రామీణ ప్రాంతాలకుచెందిన వారు వార్షిక ఆదా యం రూ. 1.50 లక్షల లోపు, పట్టణవాసులు రూ. 2 లక్షల లోపు ఉండాలని ప్రభుత్వం పరిమితి విధిం చింది. రేషన్‌కార్డు, ఆహార భద్రత కార్డు ఉన్న వారు ఆదాయ ధ్రువపత్రం సమర్పించాల్సిన అవసరం లేదని, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు లేని వారు మాత్రమే ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని ప్రభుత్వం తేల్చి చెప్పింది. వ్యవసాయ విభాగం లోని దరఖాస్తుదారులు 21 నుంచి 60 ఏళ్లలోపు, చిరు వ్యాపారాల కోసం 21 నుంచి 55 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్‌కార్డు, కులం, బ్యాంకు ఖాతా పుస్తకం సమర్పించాల్సి ఉంటుంది. 2016 నుంచి మీసేవ కేంద్రాల ద్వారా జారీ అయిన కుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవచ్చని సూచిం చింది.

- రుణాల మంజూరులో ఒంటరి మహిళలు, వితం తువులకు 25 శాతం, దివ్యాంగులకు ఐదు శాతం రిజ ర్వేషన్ కింద ప్రాధాన్యం ఇవ్వనున్నారు.
- ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నేరుగా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు సమర్పించే అవకాశం కల్పించారు.
- ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తుదారులకు వెంటనే ఆదాయ, కుల ధ్రువపత్రాలు జారీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

75 రకాల చిరు వ్యాపారాలు..

నిరుద్యోగులు ఉపాధి పొందేందుకు మొత్తం 75 రకాల చిరు వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ 4 రకాల రాయితీ రుణాలు ప్రతిపాదించింది. ఇందులో రూ. 50 వేల రుణంపై 100 శాతం రాయితీ, రూ. లక్ష రుణంపై 90 శాతం రాయితీ, రూ. 2 లక్షల రుణంపై 80 శాతం, రూ. 4 లక్షల రుణంపై 70శాతం రాయితీ ఖరారు చేసింది. వీటిలో వ్యవసాయ రుణల కింద 17 అంశాలు, వ్యవసా యేతర రుణాలు అంటే చిరు వ్యాపారాల కింద 58 అంశాలకు దర ఖాస్తు చేసుకునేలా ప్రాధాన్యం కల్పించింది. రేషన్‌కార్డు ఆధారంగా ఒక కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే దర ఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

రేషన్‌కార్డుతో లింకు..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డుతో ముడిపెట్టడంతో కార్డులు లేని వారికి శాపంగా మారింది. గత ప్రభుత్వం చివరగా 2021లో కొంత మందికి మాత్రమే రేషన్ కార్డులు జారీ చేశారు. ఏడాదిన్నర క్రితం జరిగినఅసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కార్డులు జారీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహించిన ప్రజాపాలన, గ్రామ, పట్టణ సభల్లో గ్యారంటీ పథకాల కోసం రేషన్‌కార్డులు లేని వారి నుంచి సైతం దరఖాస్తులు తీసుకున్నారు. కానీ ఇప్పటివరకు కార్డులు జారీ చేయలేదు. ఈ ఏడాది జనవరి 26న పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి కార్డులు జారీ చేసింది. గ్రామ, పట్టణ సభల్లో కొత్తగా మరిన్ని దరఖాస్తులు స్వీకరించారు. మీసేవ కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తులు తీసుకుంటున్నారు. కానీ కొత్తకార్డులు జారీ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోందని నిరుద్యోగులు వాపోతున్నారు.

రేషన్‌కార్డు లేని వారు నష్టపోకుండా చూడాలి..



అజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ, వాంకిడి

ప్రభుత్వం రేషన్‌కార్డు లేని వారు నష్టపోకుండా చూడాలి. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులకు గడువును పెంచిన ప్రభుత్వం రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికి రుణాలు మంజూరు చేయాలి. చాలా మంది కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బంది పడుతున్నారు. రేషన్ కార్డు లేనివారు నష్ట పోయే అవకాశం ఉంది. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలి.

సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భోజనం



భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం మారుమూల గ్రామమైన ఊట్‌పల్లిలో సన్న బియ్యం పొందిన లబ్ధిదారుడు మర్సకో లింగు నివాసంలో సోమవారం ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా దండే విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నదని చెప్పారు. సన్న బియ్యం పంపిణీ నిరుపేదలకు వరంగా మారిందన్నారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ సన్న బియ్య పథకానికి కేంద్ర ప్రభుత్వం వాటా 80 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 20 శాతం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' చెక్కులు పంపిణీ

సిర్పూర్(టి), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం 34 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, నలుగురికి షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు పథకానికి దరఖాస్తు చేసుకునేటప్పుడు మధ్య దళారులను ఆశ్రయిం చవద్దన్నారు. నేరుగా మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు పత్రాలు సమర్పించాలన్నారు. తక్షణమే వారికి చెక్కులు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఆర్ఐ ప్రవీణ్‌కుమార్, ఏఈ తిరుపతి, నాయకులు శంకర్, అశోక్, రావూజీ పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, నాయకులు విజయ్, బండురావు, శ్యామల, గురుదాస్, కవిరాజ్, శ్రీను, మధు, విజయ్, చొక్కారావు, శంకర్, అశోక్, మహేష్, రంగన్న, జావీద్, భూమన్న, నాగేందర్, శంకర్, సాయి, అశోక్, జగదీష్ పాల్గొన్నారు.

పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పశువులు అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం రాత్రి కౌటాల నుంచి హైదరాబాద్‌కు సరైన పత్రాలు లేకుండా 26 ఎడ్లను రవాణా చేస్తున్న 13 వాహనాలను స్వాధీనం చేసుకొని పలువురుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీన పర్చుకున్న 26 ఎద్దులను గోశాలకు తరలించామని తెలిపారు.

పాలిసెట్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ పరీక్ష రాసే విద్యార్థుల కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలిసెట్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. డీఆర్సీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు సమయాన్ని సద్వినియోగ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచిం చారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల వర్క్‌షాప్ సూపరింటెండెంట్ రామదాసుతో పాటు సిర్పూరు ఎంఈవో వేణుగోపాల్, డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీనరసింహ, జనార్దన్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, తాటి రవీందర్, పర్ష చంద్రశేఖర్, శాంతికుమార్, వెంకటరాజన్న, మహ్మద్ సాబీర్, మామిడాల శ్రీశైలం, మామిడాల తిరుపతయ్య, శ్యాంసుందర్, త్రివేణి పాల్గొన్నారు.

దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సోమవారం అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విదంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తులు అందజేశారు. నిషేధిత నకిలీ పత్తి విత్తనాలు సరఫరా అరికట్టాలని, సరఫరా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయానలి బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ వినతి అందజేశారు. సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు నేటికీ డబ్బులు చెల్లించలేదని డబ్బులు ఇవ్వాలని ఆపరేటర్లు ప్రణయ్, అనీల్, రవిలు విన్నవించారు. రెబ్బెన మండలం ఖైరిగాం గ్రామానికి చెందిన పర్వతి మహేష్ తనకు సదరం సర్టిఫికేట్ జారీ చేయాలని కోరారు. లింగాపూర్ మండలం ఎల్లాపటార్ గ్రామానికి చెందిన షేక్ సుల్తాన్ తనకు 75 శాతం దివ్యాంగ ధ్రువపత్రం ఉందని, పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజే శాడు. రెబ్బెన మండలం గోలేటికి చెందిన రమణారెడ్డినగర్‌కు చెందిన నిఖిల్ తనకు సదరం సర్టిఫికేట్ ఉందని దివ్యాంగ పెన్షన్ ఇప్పించాలని అర్జీ సమర్పించాడు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరామార్కెట్‌కు చెందిన ఆత్రం శకుంతల తాను రెబ్బెన మండలంలోని తుంగెడ-3 అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నానని ఆరోగ్య కారణంగా తనను బదిలీ చేయాలని దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మహిన్ అంజయ్ తనకు బోరిగాం శివారులో రెండు ప్లాట్లు ఉన్నాయని కబ్జాకు గురైనట్లు తనకు న్యాయం చేయాలని కోరాడు. ఆసిఫాబాద్ మండలం చోర్‌పల్లికి చెందిన బాబురావు నిరుపేద అయిన తనకు ఉపాధి హామీ పథకంలో పని కల్పించాలని దరఖాస్తు అందజేశాడు. లింగాపూర్ మండలం ఎల్లాప టార్‌కు చెందిన షేక్ మహబూబ్ దివ్యాంగ పెన్షన్ మంజూ రు చేయాలని కోరాడు.

కందుల కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకారం సంఘం ద్వారా చేపడుతున్న కందుల కొనుగోళ్లను మంగళ వారం నుంచి పూర్తిగా నిలిపి వేస్తున్నామని సీఈవో సోనకాంబ్లే జనార్దన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

వాంకిడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతి సభల పోస్టర్లను సోమవారం పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయినాథ్, నాగరాజు, శ్రావణి, వందన, అశ్లేషణ, పల్లవి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



బెజ్జూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని కుంకుడ, తలాయి గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణకు పాదయాత్ర నిర్వహించారు. తలాయి, తిక్కపల్లి, పాపనపేట, హేటిగూడ గ్రామాల్లో జై బాపు, జైభీం, జై సంవిధాన్‌లో భాగంగా ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో నాయకులు నాహీర్‌అలీ, జగ్గాగౌడ్, విశ్వేశ్వర్, రషీద్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్ (ఆంధ్రజ్యోతి): బల్హాన్‌పూర్, వావుదాం గ్రామ పంచాయతీల్లో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు చరణ్, మల్లేష్ రాజ్యాం పరిక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వసంత్‌రావు, కలీం, యశ్వంత్‌రావు, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

జోడేఘాట్‌లో మహాసభల ఏర్పాట్లు పరిశీలన

కెరమెరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జోడేఘాట్‌లో ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించే తుడుందెబ్బ ఆదివాసీ మహాసభ ఏర్పాట్లను సోమవారం ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ కోట్నాక విజయ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై మ్యూజియం క్యూరేటర్ దుందిరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహాసభకు వచ్చే వారికి ఎలాంటి లోటు పాట్లు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు. రాష్ట్ర మహాసభలను విజయవతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. అనంతరం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవారి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

బెజ్జూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశాలలో సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మర్తిడి గ్రామ సమీపంలోని చెరువులో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సౌకర్యాలపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెబ్బెన గ్రామంలోని నర్సరీని పరిశీలించారు.

దాహార్తి తీర్చేందుకు అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో దాహార్తిని తీర్చేందుకు అంబలి పంపిణీ చేస్తున్నామనిమాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కౌటాల మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వార సంతలో అంబలి పంపిణీ చేస్తామని అన్నారు. వార సంతకు దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ అంబలి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, నాయకులు నాజీం హుస్సేన్, మనీష్, శైలజ ప్రభాకర్‌గౌడ్, వసంత్, మధుకర్, శ్రీనివాస్, రంగన్న, రమేష్, లహంచు, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన యూనిఫాంల తయారీ

సిర్పూర్(టి), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 52 పాఠశాలలకు చెందిన 3150 మంది విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన యూనిఫాంలు నాణ్యతగా తయారు చేసేందుకు ప్రభుత్వం మోడల్(కోడ్)ను ఎంపిక చేసి పంపిణీ చేయనున్నట్లు ఏపీఎం దుర్గయ్య తెలిపారు. స్థానికంగా సోమవారం ఆయన మాట్లాడుతూ యూనిఫాంలను ఐకేపీ మహిళల ద్వారా పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా తయారు చేయిస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కొలతలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధి పనుల వేతనాలు చెల్లించాలి

జైనూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల వేతనాలు చెల్లించాలని మండలంలోని పవర్‌గూడ, జామ్ని, రాసిమెట్ట, గూడామామడా తదితర గ్రామాల కూలీలు కోరారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద పలువురు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి, మార్చి నెలలో పూర్తి స్థాయిలో పనులు చేసినప్పటికీ తమకు ఇంత వరకు వేతనాల రాలేదని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కూలీలు

ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన

ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకంలో తమకు పనులు కల్పించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనం ఎదుట కూలీలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీల సంఘం అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి పావని మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు కావడంతో ఉపాధి హామి పథకంలో పని చేసే అవకాశాన్ని కోల్పోయామని చెప్పారు. కూలీ చేస్తు గాని పూటగడవని తమ కుటుంబాలకు తీరని అన్యాయం జరగిందన్నారు. అధికారులు స్పందించి తమకు గతంలో మాదిరిగా పని కల్పించాలని కోరారు. ఆసిపాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కూలీలకు చెందిన జాబ్ కార్డులు రాజంపేట గ్రామపంచాయతీలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు స్వరూప, కోశాదికారి మంజుల, సహాయ కార్యదర్శి సుగుణ, కూలీలు పాల్గొన్నారు.

వరంగల్ సభకు అభిమానులు తరలిరావాలి



ఆసిఫాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు జిల్లా నుంచి బీఆర్ఎస్ అభిమానులు తరలిరావాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజక వర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావు చాలా ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ సభను విజయవంతం చేసే బాధ్యత ప్రతీ నాయకుడిపై ఉందన్నారు. కార్యకర్తలు ప్రతి గ్రామంలో సభ గురించి చర్చించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు జిల్లా నుంచి అభిమానులు తరలిరావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానికంగా సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలం నుంచి మండలాధ్యక్షుడు బాధ్యతతో కార్యకర్తలను తరలించాలన్నారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ జెండాను ఎగురవేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన గొప్ప పనులు, కేసీఆర్ ఉద్యమ ప్రస్తానం, సాధించిన విజయాలను ఊరురా తెలిసేలా చూడాలని పిలుపునిచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లెండు గురే శ్యాంరావుతో పాటు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయ్యేనా..?

- ఐదేళ్లుగా సాగుతున్న పనులు
- వృథాగా పోతున్న గంగాపూర్ వాగు జలాలు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



పూడిక, చెత్తాచెదారంతో నిండిపోయిన గంగాపూర్ చెక్‌డ్యాం

రెబ్బెన, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గంగాపూర్ వాగు జలాలు వృథాగా పోకుండా అడ్డుకంట వేసి సాగు కష్టాలు తీర్చాలన్న తలంపుతో చేపట్టిన చెక్‌డ్యాం నిర్మాణం ఐదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగుతోంది. భూగర్భజలాలు పెంచేందుకు లక్ష్యంగా ప్రభుత్వం వాగుల్లో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టింది. వాగు నుంచి వృథాగా పోతున్న నీటికి అడ్డుకట్టవేసి తక్కువ ఎత్తులో చెక్‌డ్యాంల నిర్మించడం మూలంగా భూగర్భ జలాలు పెరుగడంతో పాటు వాగు సమీప రైతులు మోటార్ల ద్వారా నీటిని వాడుకునేలా రూపకల్పన చేశారు. ఈ చెక్‌డ్యాం చుట్టు పక్కల సుమారు 200 ఎకరాల్లో కూరగాయాలు, ఇతర పంటలు సాగు చేస్తారు. పనులు పూర్తి చేస్తే ప్రయోజనం ఉంటుందనుకున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి.

● రూ.4.8 కోట్ల అంచనా వ్యయంతో..

మండలంలోని గంగాపూర్ వాగులో సుమారు రూ.4.8 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం చెక్‌డ్యాం మంజూరు చేసింది. దీంతో ఇరిగేషన్ అధికారులు 2019లో పనులు ప్రారంభించారు. ఏడాదిన్నర లోపు పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ నేటికి చెక్ డ్యాం పనులు అసంపూర్తిగానే ఉన్నారు. టెండరు ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కేవలం 80 శాతం పనులు మాత్రమే పూర్తి చేశాడు. 2.8 మీటర్ల ఎత్తులో చెక్‌డ్యాం నిర్మించారు. కరకట్టలు నిర్మించాల్సి ఉంది. కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. చెక్‌డ్యాం నిర్మించిన ప్రదేశానికి దిగువన ఉన్న పైప్ కల్వర్టు నుంచి వర్షాకాలంలో వచ్చే వరద ప్రవాహం నేరుగా అందులోకి చేరడంతో ఇసుకమేటలు పేరుకపోతున్నాయి. దీంతో నీరు నిల్వ లేని పరిస్థితి ఏర్పడుతోంది. చెక్‌డ్యాం పనులు త్వరితగతిన పూర్తి చేసి అధికారులు పైప్ కల్వర్టు గుండా వచ్చే వరద ప్రవాహాన్ని దారి మళ్లించే చర్యలు తీసుకోవడం లేదు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తి దశ వీడడం లేదు.

చెక్ డ్యాం నిర్మించే సమయంలో తోడిన మట్టిన నీరు నిల్వ ఉండే ప్రాంతంలో పోశారు. కానీ చెక్ డ్యాంకు సంబంధించిన బాడీవాల్ నిర్మాణం పూర్తి అయ్యాక మట్టిని తొలగించలేదు. దీంతో వర్షాకాలం వరదతో మట్టి చెక్ డ్యాం బాడీ వాల్ వద్దకు చేరి నిండి పోయింది. చెక్ డ్యాం పూర్తయితే నిల్వ ఉండే నీటి ద్వారా భూ గర్భ జలాలు పెరగడంతో పాటు నిల్వ నీటిని మోటార్ల ద్వారా పంటలకు అందించవచ్చని సమీప రైతులు భావించారు. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంగా కోట్ల రూపాయిలతో నిర్మించినచెక్ డ్యాం ఎందుకు పనికి రాకుండా పోయిందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ చెక్ డ్యాం పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసురావాలని రైతులు కోరుతున్నారు.

ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

భీమారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని చంపుతానని బెదిరించిన కేసులో మండలంలోని మద్దికల్ గ్రామానికి చెందిన చిలకాని కనకయ్య, చిలకాని మాదయ్య, బంధం శ్రీనివాస్‌లకు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధిస్తూ చెన్నూరు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి పర్వతపు రవి సోమవారం తీర్పునిచ్చారు. భీమారం ఎస్‌ఐ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. దహగామా ఉమామహేశ్వర్‌కు చెందిన భూమి మద్దికల్ శివారులోని సర్వే నెంబరు 708, 712లలో 26 ఎకరాల పట్టా భూమి ఉంది. తన భూమిని 2018 లో ట్రాక్టర్‌తో ఉమామహేశ్వర్ దున్నుతున్న క్రమంలో ముగ్గురు ట్రాక్టర్‌ను అడ్డుకుని చంపుతానని బెదిరించడంతో ఉమామహేశ్వర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందని తెలిపారు. సోమవారం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ నంది రవీందర్ సాక్షులను విచారించగా నేరం రుజువు అయిందన్నారు .దీంతో జడ్జి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

దహెగాం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అమర్‌గొండ గ్రామ శివారులో సోమవారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. సమాచారం మేరకు దాడి చేసి నలుగురి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్, రూ.880 నగదు స్వాధీన పర్చుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలించకుండా చర్యలు

● శ్రీనివాస్, తహసీల్దార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : ఇసుక అక్రమ రవాణా చేయకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్ : ఇసుక అక్రమ రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి జరిమానా విధిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు పనుల కోసం వినియోగించే ఇసుక ప్రభుత్వానికి డీడీ రూపంలో చాలాన్ కట్టి ఇసుక తీసుకెళ్లాలి.

ఆంధ్రజ్యోతి : ఈ నెలలో సన్న బియ్యం ఎంత మంది లబ్ధిదారులకు ఇచ్చారు?

తహసీల్దార్ : సన్న బియ్యం పంపిణీ మండలంలో 17 రేషన్ దుకాణాల ద్వారా 7481 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశాం. రేషన్‌కార్డులు ఉన్న అందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : ఆదాయ, నివాస ధ్రువపత్రాల జారీ వేగంగా కొనసాగేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్ : మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి సిబ్బంది వారి పూర్తి వివరాలు పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారు. ఇబ్బందులు ఉంటేనే కార్యాల యంలో సంప్రదిస్తే సిబ్బంది వివరాలు తెలియజేస్తారు.

\- సిర్పూర్(టి), ఆంధ్రజ్యోతి

దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో గత నెల 29వ తేదీన సానా శ్రావణ్ ఇంటిలో దొంగతనానికి పాల్పడిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏసీపీ రవికుమార్ తెలిపారు. సోమవారం తాళ్లగురిజాల సీఐ కార్యాలయంలో ఏసీపీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సానా శ్రావణ్ ఇంటిలో 14తులాలన్నర బంగారం, కిలోన్నర వెండితో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధాకర్ ఇంటిలో ఐదు తులాల బంగారంతో పాటు నాలుగు ద్విచక్రవాహనాలు చోరికి గురయ్యాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని తెలిపారు. సోమవారం వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో బెల్లంపల్లి స్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న గజానంద్‌ను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం కనేర గ్రామం నుంచి 12 మంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి బెల్లంపల్లిలో రెక్కీ చేసి దొంగతనానికి పాల్పడ్డట్టు గజానంద్ విచారణలో తెలిపారన్నారు. దొంగతనం చేసి రైల్వేస్టేషన్ ప్రాంతంలో బైక్‌లను దాచారన్నారు. అక్కడి నుంచి రైలు ద్వారా కాజీపేటకు వెళ్లి గత నెల 31న కాజీపేటలో దొంగతనానికి పాల్పడ్డట్టు విచారణ తెలిపాడన్నారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో దాచిన బైక్‌ల కోసం బెల్లంపల్లికి మళ్లీ తిరిగి వచ్చిన గజానంద్ పోలీసులకు పట్టుబడ్డట్టు ఏసీపీ తెలిపారు. తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక, జమ్మూకాశ్మీర్ ప్రాంతంలో ముఠాలుగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడ్డట్టు విచారణలో తేలిందన్నారు. దొంగతనానికి పాల్పడ్డ అంతరాష్ట్ర దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని పట్టుబడ్డ గజానంద్ అనే వ్యక్తి నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ అఫ్జలోద్దీన్, ఎస్‌ఐలు రమేశ్, మహేందర్, ప్రసాద్,లు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్య



హషాం అహ్మద్(ఫైల్)

మందమర్రిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతినగర్ ఏరియాకు చెందిన ఎండీ హషాం అహ్మద్ (44) సోమవారం లక్షెట్టిపేటలోని రాయపట్నం వద్ద గల గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి పని ఉందని కుటుంబీకులతో చెప్పి హషాం అహ్మద్ బయటకు వెళ్లాడు. సోమవారం ఉదయం గోదావరిలో మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

అటవీ కుక్కల దాడిలో మేకంకు గాయాలు

దహెగాం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామ సమీపంలో సోమవారం మేకంపై అటవీ కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. గామస్థులు గమనించి కుక్కలను తరిమి వేశారు. అనంతరం గాయపడ్డ అడవి మేకంకు నీరు తాగించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వాచర్ అక్కడకి చేరుకున్నాడు. అటవీశాఖ అధికాకారులను ఈ విషయంపై ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా ఎఫ్ఆర్వో నిజాము ద్దీన్‌తో పాటు ఎవరు అందుబాటులోకి రాలేదు.

జోడేఘాట్‌ను సందర్శించిన విద్యార్థులు



క్షేత్ర స్థాయి పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా కాగజ్‌నగర్ ఓల్డ్ హైస్కూల్ విద్యార్థులు సోమవారం జోడేఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవాజీ మాట్లాడుతూ జోడేఘాట్‌లోని గిరిజన సంస్కృతి, మ్యూజియంలోని వస్తువులను విద్యార్థులు తిలకించారని తెలిపారు.

కొండగట్టుకు భక్తుల పాదయాత్ర

కెరమెరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సావర్‌ఖేడ గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారులు సోమవారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. 21 రోజులు మాలలు దరించిన భక్తులు గత 18 రోజులుగా సావర్‌ఖేడ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో నిత్యం పూజలు చేశారు. 12న కొండగట్టుకు చేరుకుంటామని భక్తులు తెలిపారు.

మెడికల్ కళాశాల విద్యార్థుల ర్యాలీ

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ, ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, సత్యం పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

తిర్యాణి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జోడేఘాట్‌లో ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించే తుడుందెబ్బ ఆదివాసీ మహాసభల పోస్టర్లను తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు భగవంతరావు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుభాష్, గణపతి, దర్శు, బొజ్జిరావు, మారుతి పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బాలికలు సకాలంలో పోషక ఆహారం తీసుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పింకీస్ ఫౌండేషన్ సహకారంతో నవిసమ్మాన్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన బాలికలకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సకాలంలో పౌష్టిక ఆహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులలో క్రీడారంగంలో ఎంచుకున్న రంగాలలో రాణించవచ్చని తెలిపారు. పింకీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 35 పాఠశాలలను శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థినులు ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుధ్య సూత్రాలు పాటించాలని తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్, పింకీస్ ఫౌండేషన్ మేనేజర్ భార్గవి బట్నగర్, కార్యదర్శి పండిట్ శాలిని గుప్తా, అధ్యక్షుడు అరుణ్ గుప్తా, జిల్లా పరీక్షల కమిషనర్ ఉదయ్‌బాబు, జిల్లా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో వేగంగా అభివృద్ధి పనులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.10 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నా యని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం, ఎన్జీవోస్ కాలనీ, డాడానగర్‌లో వివిధ అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులైన జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులతో సిర్పూరు నియోజకవర్గంలో అంతర్గత రోడ్లు, మురికి కాల్వలు, సిమెంటు రోడ్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. వివిధ పథకాల కింద మంజూరైన నిధులతో పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు పూర్తి కావటంతో గ్రామాల్లో సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబుకు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

స్థానిక త్రిశూల్ పహాడ్‌పై ఉన్న టీఎన్జీవోప్లాట్స్‌కు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవో సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ తమకు ప్లాట్స్ ఉన్నాయని, కరెంటు సౌకర్యం లేక పోవటంతో నిర్మాణాలు చేపట్టలేక పోతున్నట్టు వివరించారు. కరెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీఎన్జీవో సంఘం సభ్యులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు



50 మినీ చెరువుల నిర్మాణానికి ప్రణాళిక



మాట్లాడుతున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా 50 మినీ చెరువుల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలమని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సింగరేణి నీటి బిందువు-జల సింధువు కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించామని చెప్పారు. సకల జీవరాసులకు ప్రాణప్రదమైన నీటిని ఒడిసి పట్టేందుకు మైనింగ్ చేసిన ప్రాంతాల్లో, వెలుపల రెండు కిలోమీటర్ల పరిధిలో 50 మినీ చెరువులను నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న చెరువుల్లో పూడిక తొలగించాలని సూచించారు. కేంద్ర పర్యావరణ శాఖ సూచనల మేరకు చెరువుల పనులు చేపట్టనున్నట్లు సీఎండీ తెలిపారు. చర్యలు తసుకోవాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు(ఈ అండ్ ఎం), సూర్యనారాయణ(ఆపరేషన్స్), వెంకటేశ్వర్లు(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), ఈడీ(కోల్ మూమెంట్) సుభానీ, ఫారెస్ట్ సలహాదారు మోహన్ పరిగెన్ తదితరులు పాల్గొన్నారు.

టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు వచ్చే నెల 20న చేపట్టే ఒక్కరోజు టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, కంబాల నర్సయ్య కోరారు. యూనియన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభజించడం సరికాదన్నారు. వాటిని అమలు చేస్తే కార్మికులు ఎంతో నష్టపోతారని చెప్పారు. అన్ని కార్మిక సంఘాలు కలిసికట్టుగా చేస్తున్న ఈ సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రవేశపెట్టిందని, వాటిని అమలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం లక్ష్మణ్, కొల్లూరి శ్రీనివాస్, కొట్టె సురేష్, నామాల శ్రీనివాస్, మహేష్, వేముల వంశీ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం వైఖరి సరికాదు



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్

మందమర్రి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలో బొగ్గు నిక్షేపా లు ఉన్నప్పటికీ కావాలనే కొన్ని గనులను యాజమాన్యం మూసివేసే వైఖరి సరికాదని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. హెచ్ఎం ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓపెన్‌కాస్టులు లాభాల దిశగా నడుస్తాయని ప్రారంభించగా కొన్ని ఏరియాల్లో ఓసీలు నష్టాల్లో నడుస్తున్నాయన్నారు. పదేళ్ల క్రితం ప్రారంభించిన ఆర్కే ఓసీ మూసివేసే దిశగా ప్రయత్నిస్తుందని, ఇది అధికారుల ప్లానింగ్ లోపం కారణం కాదా అని మండిపడ్డారు. అంతే కాకుండా కేకే 1, ఆర్కే 1ఏ లో దాదాపు ఆరేళ్లకు పైగా బొగ్గు నిల్వలు ఉన్నా ముందస్తుగా మూసివేయడం ఏమిటని ప్రశ్నించారు. షాఫ్టు ద్వారా 20 ఏళ్ల నడవాల్సిన గనులు లాభాలు రావడం లేదని మూసివేస్తున్నారని, ఇది సరియైంది కాదన్నారు. కేకే 5 గని కూడా త్వరలో మూసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపిం చారు. పదేళ్ల క్రితం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన కేకే 6 గనిని ఎందుకు ప్రారంభించడంలేదో దీనిపై గుర్తింపు సంఘాలు నోరు మెదకపోవడం వారి చేతకాని పనికి నిదర్శనమన్నారు. ఒక మందమర్రిలో కేకే 5 గనికి ఇంకా భవిష్యత్ ఉందని, దీనిపై కూడా గుర్తింపు సంఘాలు మాట్లాడకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ భవిష్యత్ కోసం బావి తరాల ఉపాధి అవకాశాలే లక్ష్యంగా హెచ్ఎంఎస్ సింగరేణి వ్యాప్తంగా చైతన్య యాత్రలు చేపట్టాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. సమావేశంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్, నాయకులు వెల్ది సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి రామస్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



ఫిజియోథెరపీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు మౌలిక సదుపాయాలు కల్పించేం దుకు కృషి చేస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీ య వైద్య దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎంఓ డాక్టర్ పి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ఆర్కే 8 డిస్పెన్సరీలో నిర్వహించిన కార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరపత్రాలు ఆవిష్కరించారు. ఫిజియోథెరపీ యంత్రాలను ప్రారంభించారు. యువ ఉద్యోగులు రక్తదానం చేయగా, వారికి ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసేందుకు శిక్షణలో ఉన్న 44 మంది ఉద్యోగులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అలాగే వీటీసీ శిక్షకులు రాజ్‌కుమార్ 56వ సారి రక్తదానం చేసి ఎంతో మంచిపని చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, డాక్టర్ లోకనాథ్ రెడ్డి, పిట్ కార్యదర్శి విజయలక్ష్మి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నిర్వహణ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం అందజేయాలి

రెబ్బెన, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గోలేటి సింగరేణి ఓపెన్‌కాస్టులో భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ.25లక్షలు, కుటుంబంలో ఒకరికి పర్మినెంటు ఉద్యోగం కల్పించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్ కోరారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోనాపూర్ శివారులో ఓపెన్ కాస్టులో ముంపునకు గురవుతున్న భూములకు సింగరేణి యాజమాన్యం ఎకరాకు రూ.25లక్షల రూపాయిలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్టుతో నష్టపరిహారం కింద యాజమాన్యం కేవలం రూ.7లక్షలు ఇచ్చేందుకు యత్నిస్తున్న ట్లు తెలుస్తోందన్నారు. ఇలాంటి ఆలోచనలు మానుకోవాలన్నారు. దళిత, గిరిజన, బీసీ వర్గాల రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదన్నారు. రైతుల పక్షాన ఉండి బీజేపీ న్యాయ పోరాటం చేస్తోందని తెలిపారు. సమావేశంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్, సిడాం ధర్మపటేల్, సిడాం జైతూ, నారా నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అన్ని గనులు, విభాగాల ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు రెండో రోజు ఉత్సాహంగా కొనసాగాయి. సోమవారం కృష్ణకాలనీలోని శాంతి మైదానంలో ఆర్కే - 7 గనికి చెందిన ఉద్యోగులకు పోటీలు నిర్వహించారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోతె కొమురయ్య హాజరై మాట్లాడుతూ, చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.

జాగ్రత్తలతో వడదెబ్బ దూరం..

పీవీవీఎస్ఎన్ మూర్తి, ఆర్ఎంవో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బెల్లంపల్లి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : వడదెబ్బ తగల కుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

ఆర్ఎంవో : జిల్లాలో కొన్ని రోజు లుగా 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేప థ్యంలో వడదెబ్బ తగలకుండా ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. రసా యనాలతో తయారు చేసిన శీతల పానియాలు తాగవద్దు. మజ్జిగ, అంబలి, స్వచ్ఛమైన నీరు ఎక్కువ తాగడంతో వడదెబ్బ నుంచి కాపాడు కోవచ్చు. పండ్ల రసాలు, నిమ్మరసా లు ఎక్కువగా తీసుకోవాలి ఎండకు బయటకు తిరగాల్సి వస్తే తలకు టోపీకాని, తెల్లని వస్త్రంగాని ధరించాలి.

ఆంధ్రజ్యోతి : వడదెబ్బ బారిన పడితే ఎలా గుర్తించాలి?

ఆర్ఎంవో : వడదెబ్బ బారిన పడిన వ్యక్తుల్లో నాడి వ్యవస్థ వేగం గా కొట్టుకోవడంతోపాటు శరీరం నుంచి చెమట అధికంగా వస్తుంది. నీరసంగా అనిపించడం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, నాలుక ఎండిపోవడం వంటి వాటితో గుర్తిం చవచ్చు. శరీరంలో తగినంత నీరు లేకపోతే రక్తసాంద్రత పెరుగుతుం ది. శరీరంలో నీటి పరిమాణం తగ్గకుండా చూసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : వేసవి దృష్ట్యా ఆసుపత్రిలో కల్పిస్తున్న సదుపాయా లు ఏమిటి?

ఆర్ఎంవో : ఆసుపత్రిలో వడ దెబ్బకు గురైన వ్యక్తులకు సంబం ధించి పూర్తి స్థాయిలో మందులు ఉన్నాయి. ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు ఫ్లూయిడ్స్ ఇతర కావాల్సిన మందులు అందుబాటులో ఉంచాం. వడదెబ్బ బాధితులకు చికిత్స అందించడానికి వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఎవరికైన వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి రావాలి.

- బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి)

కూరగాయల సాగుతో లాభాల పంట

- ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు
- పంట మార్పిడితో రోజువారీ ఆదాయం
- సాగుకు ఉద్యానశాఖ ప్రోత్సాహం



పచ్చిమిర్చి కోస్తున్న కూలీలు

(5వ పేజీ తరువాయి..)

పెట్టుబడులు పెట్టి 12నెలలు ఎదురుచూడాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా కూరగాయల సాగుతో రోజు వారీ ఆదాయం లభిస్తుంది. దీంతో రైతులు ప్రతీ నిత్యం డబ్బులు కళ్ల చూసే అవకాశం ఉంటుంది. ఒక పంట చేతి కొచ్చి ఎండిపోయేలోపు మరో పంట కాపు కొచ్చేలా సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో ఒకటి రెండు రోజులకోసారి దిగుబడులు చేతికి వస్తాయి. వచ్చిన పలసాయాన్ని ఏరోజుకారోజు తాజాగా మార్కెట్‌కు తరలించి అమ్ము కోవచ్చు. దాదాపుగా అన్ని



భీమినిలో మల్చింగ్ విధానంలో సాగు చేసిన కాకర పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి కల్పన, క్లస్టర్ అధికారి అరుణ్‌కుమార్

కూరగాయలు నాటిన 40 రోజుల నుంచి కాయడం ప్రారంభం అవుతాయి. ఆకుకూరలు నెలరోజుల్లోనే చేతికి వస్తా యి. కొందరు కరీంనగర్, హైదరాబాదు లాంటి నగరాలకు కూరగాయలు ఎగుమతి చేస్తున్నారు. మరికొందరు బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, గోదావరిఖని, లక్షెట్టిపేట లాంటి పట్టణాల్లోని మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయించుకుంటున్నారు. మరికొందరు సమీప గ్రామాల్లో తిరిగి అమ్ముకుంటున్నారు. కూరగాయల సాగుతో రైతులు ఆదాయం పొందడంతో పాటు కూలీలకు ఉపాధి లభిస్తోంది.

● ప్రభుత్వ ప్రోత్సాహం..

రైతుల ఉత్సాహానికి తోడు ప్రభుత్వం కూరగాయల సాగు ను ప్రోత్సహిస్తోంది. శాశ్వత పందిళ్లు, మల్చింగ్, బిందు సే ద్యానికి భారీగా సబ్సిడీలు ప్రకటించింది. సూక్ష్మనీటిపారుద ల పథకంలో రైతులకు బిందు సేద్యం పరికరాలు, స్ప్రిం క్లర్లు సబ్సిడీపై ఇస్తున్నారు. డ్రిప్ ఇరిగేషన్ కోసం ఎస్సీ, ఎస్టీ రైతు లకు వందశాతం సబ్సిడీ, బీసీలకు, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరరైతులకు 80శాతం రాయితీలభిస్తోంది. రక్షిత సాగులో భాగంగా బిందుసేద్యం ఉన్న రైతులకు మల్చింగ్ కోసం ఒక హెక్టారుకు 50శాతం, గరిష్టంగా 16,000 రూపా యలు మించకుండా ఒక్కో రైతుకు రెండు హెక్టార్లవరకు రాయితీ ఇస్తున్నారు. అధికదిగుబడులు సాధించేలా రైతుల కు అధికారులు సూచనలు ఇస్తున్నారు.

పంట మార్పిడితో లాభాలు..



నిరుడు యాసంగిలో అర ఎకరంలో వేరుశనగ సాగు చేసి నష్టపోయాను. ఈ ఏడు గోరుచిక్కుడు, వంకా య, పచ్చిమిర్చి సాగు చేశా ను. ఇతర పంట ల్లాగ ఒకేసారి కాకుండా రోజువారీ ఆదాయం లభిస్తోంది. తక్కువ పెట్టుబడితో లాభాలు వస్తు న్నాయి. కూలీల ఖర్చు కూడా ఉండదు. ఎప్పటిక ప్పుడు మంచి ర్యాల కూరగాయల మార్కెట్‌కు తీసు కెళ్లి అమ్ము కుంటున్నాను. వేరే పంటల కన్న కూర గాయల సాగు లాభదాయకంగా ఉంది.

- సింద శ్రీనివాస్, రైతు, జజ్జరవెల్లి, భీమిని మండలం

ఆధునిక పద్ధతిలో సాగు..

ఆధునిక పద్ధతులు పాటించి కూరగాయలు సాగు చేస్తున్నాను. ఒకటిన్నర ఎకరంలో సిమెంటు దిమ్మెలతో శాస్వత పందిళ్లు వేసి బీర పంట వేశాను. రెండు రోజులకోసారి క్వింటాలు నుంచి క్వింటా లు న్నర దిగుబడి వస్తుంది. ప్రస్తుతం బీరకాయ హోల్ సేల్‌గా రూ. 50కి కేజీ పలుకుతోంది. ఖర్చులు పోను సగటున రోజుకు రెండు వేల రూపాయలు మిగులు తున్నాయి. వర్షాకాలంలో టమాటాకు మంచి డిమాం డ్ ఉంటుంది. ఆగస్టులో దిగుబడి చేతికి వచ్చేలా టమాటా సాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాను.



- ఏస్యూరి సత్యనారాయణ, నెన్నెల

ఆకుకూరల సాగుతో ఆదాయం..



15 గుంటల విస్తీర్ణంలో తోటకూర, పాలకూర, గంగవాయిలు, కొతిమీర, మెంతి సాగుచేస్తున్నాం. ఎండాకాలంలో ఆకుకూరలకు డిమాండ్ వల్ల ధర కూడా రెట్టింపు ఉంటుంది. కష్టానికి తగ్గ ఫలితం వస్తుంది. ఆకు కూరల సాగుతో ఇంత వరకు నష్టాలు మాత్రం ఎన్నడూ రాలేదు. కాలాన్ని బట్టి పంటలు విత్తుకుంటాం. స్థానికంగా తిరిగి అమ్మడంతోపాటు బెల్లంపల్లి మార్కెట్‌కు తీసుకెళ్తాం. అన్ని పంటలు ఒకేసారి చేతికి రాకుండా ఒక్కోటి కోతకు వస్తాయి. దీంతో ఆదాయానికి ఢోకా ఉండదు.

- సుంకరి బాపు, రైతు, నెన్నెల

కూరగాయల సాగుకుప్రభుత్వ ప్రోత్సాహం..

ఆరోగ్యంతో పాటు ఆదాయాన్ని ఇచ్చే కూర గాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తు న్నది. మల్చింగ్ విధానంతో కలుపు నివారించుకోవచ్చు. నీరు ఆవిరి కాకుండా భూమి ఎక్కువకాలం తడిగా ఉంటుంది. మల్చింగ్‌కు కూడా రాయితీ ఉంది. శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు ఎకరానికి ఒక లక్ష రాయితీ ఉంది. ఆధునిక సాగు విధానం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కూరగాయలు పండించాలనుకునే రైతులు ఉద్యాన అధికారులను సంప్రదించాలి. వారికి పూర్తి సహాయ సహకారులు అందిస్తాం.



- అరుణ్‌కుమార్, బెల్లంపల్లి క్లస్టర్ ఉద్యాన అధికారి

అంబలి పంపిణీ

బెల్లంపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిలక్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికులకు సోమవారం అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భం గా సభ్యులు మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో వ్యాపారస్తులకు, కార్మికులకు ప్రతిరోజు అంబలి పంపిణీ చేయనున్న ట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రత్నం రాజన్న, నాగేశ్‌కుమార్, జయరాం యాదవ్, వెంక టరాజం, రామన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

చెన్నూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్లపైకి పశువులను వదిలి తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులను రోడ్లపై వదిలివేస్తుండడంతో వాహనదారులు, పాద చారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్ర మాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మూడురోజుల్లోగా పశువుల యజమాను లు రోడ్లపైకి పశువులు రాకుండా సొంత స్థలంలో నిర్భందించుకోవాలని లేకుంటే ప శువులను గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

భూమి కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు

మందమర్రిరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తుర్కపల్లి గ్రా మానికి చెందిన మహిళ తనభూమిని కొందరు కబ్జా చేస్తున్నారని పేర్కొంటూ ప్రజావాణిలో తహసీల్దార్ సతీష్‌కుమార్ కు సోమవారం ఫిర్యాదు అందించింది. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

గర్మిళ్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతో త్సవ సభను విజయవంతం చేయాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నివాసంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదిన హన్మ కొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రజతోత్సవ సభను నిర్వహి స్తున్నామన్నారు. ఈ సభకు మాజీ సీఎం కేసీఆర్ హాజరై దిశానిర్దేశం చేస్తారన్నారు. సభను కార్యకర్త లు, ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చా రు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, పక్కన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, నాయకులు

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజిత్ కుమార్, మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, లక్షెట్టిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు అంకం నరేశ్, సందెల వెంకటేశ్, పల్లె భూమేశ్, పోగుల రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న హన్మకొం డ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు కేసీఆర్ హాజరవుతున్నారని నా యకులు, కార్యకర్తలు విజయవంతం చే యాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావే శానికి ముఖ్య అతిథిగా బాల్క సుమన్ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ రజతోత్స వ సభకు నియోజకవర్గానికి మూడువేల మంది కార్యకర్తలు తరలిరావాలని సూచించారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాదిన్నర కాలంలోనే అన్నివర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందని తెలిపారు. చెన్నూర్, బె ల్లంపల్లి ఎమ్మెల్యేలకు మంత్రి పదవులపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలు పుకోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి, నాయకులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

జన్నారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణ లో ఉన్న తనను దూషిస్తూ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బర్తన్‌పేట్ బీట్ అధికారి రుబానాతాలత్ అన్నారు. సోమవారం మండల కేంద్రం లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 4న ఉదయం 10 గంటల సమయంలో బర్తన్‌పే ట్ బీట్‌లోని కంపార్టుమెంట్ నంబర్ 242 కోర్ ఏరియా లో అక్రమంగా ఇసుక తరలించేందుకు ట్రాక్టర్ వచ్చిం దన్నారు. ఇసుకను తరలించేందుకు ఎలాంటి అనమ తులు లేవని తాను చెప్పడంతో వాహన యాజమాని ఎజాసుద్దీన్ ఇష్టానుసారంగా తనను దూషించి ట్రాక్టర్ ను తీసుకువెళ్లాడన్నారు. తాను వెంబడించగా కొత్తపే ట గ్రామ శివారులో ఎజాసుద్దీన్ సోదరుడు రియాజు ద్దీన్ వచ్చి ట్రాక్టర్‌ను ఆపుతావా అంటూ తన చేయి పట్టుకుని లాగి పక్కకు నెట్టారని, కర్రతో కొట్టేందుకు వచ్చారని, తీవ్ర పదజాలంతో తిట్టారని తెలిపారు. ఇద్దరు అన్నదమ్ములు తనను కింద పడేయడం



సమావేశంలో మాట్లాడుతున్న బీట్ అధికారులు

తోపాటు తన భర్త అఫ్రోజ్‌ఆలీని కాళ్లతో తన్నారని తెలిపారు. ఈ విషయమై పైఅధికారులుగా తెలిపి ఈ నెల 5న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని కోరారు. ఆమె వెంట బీట్ అధికారులు ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

జైపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జార్జిరెడ్డి వర్ధంతి సభల పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పీడీఎస్‌యూ నాయకులు విడుదల చేశారు. ఈనెల 10 నుంచి 14వ వరకు జరిగే జార్జిరెడ్డి వర్ధంతి సభలను జరుపుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపా ధ్యక్షుడు సికిందర్ సూచించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో మతోన్మాదానికి, మహిళ లపై జరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి జార్జిరెడ్డి అని పేర్కొన్నారు. జార్జిరెడ్డి ఎదుగుదలను జీర్ణిం చుకోలేని మతోన్మాద గుండాలు హత్య చేశా రని తెలిపారు. కార్యక్రమంలో అఖిల, రమ్య, కావ్య, మహే శ్వరి, ప్రసన్న, స్వప్న పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ

చెన్నూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మెర గ్రామంలో సన్నబి య్యం పంపిణీ కార్యక్రమాన్ని మాజీ జడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు సో మవారం ప్రారంభించారు. ఆయన మా ట్లా డుతూ అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందేలా ప్ర భుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాప గౌడ్, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆవడంలో గడ్డివాము దగ్ధం

నెన్నెల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవడంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో జాడి లింగయ్యకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో గడ్డివాముకు అకస్మాత్తుగా అగ్గిరాజుకుని మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పివేశారు. కాని అప్పటికే గడ్డి మొత్తం కాలిపో యింది. అక్కడే కట్టేసి ఉన్న రెండు ఆవులు స్వల్ప గాయాలతో బయటపడ్డాయి. ఈ దుర్ఘటనలో తనకు రూ. 20 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతు లింగయ్య కోరుతున్నాడు.

ఒప్పంద ప్రాతిపదికన ఖాళీ పోస్టు భర్తీ

గర్మిళ్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో ఒప్పంద ప్రాతిపదికన జాతీయ ఆరోగ్యమిషన్ నందు మంజూరైన డిస్ట్రిక్ట్ డాటా మేనేజర్ పోస్టును భర్తీ చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారు లు నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈ పోస్టుకు అప్లై చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల8 నుంచి 11వరకు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్ర 5గంటల్లోపు ఐడీవోసీ నస్పూర్ నందు అందజేయాలని ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. మరిన్ని వివరాలకు సంస్థ వెబ్‌సైట్ సంప్రదించాలని కోరారు.

ప్రశ్నాపత్రాలను హెచ్‌ఎంల వద్ద భద్రపరచాలి

మంచిర్యాల క్రైం, ఏప్రిల్7(ఆంధ్ర జ్యోతి): ఆరో తరగతి నుంచి 9వ తరగతికి పరీక్షలు ఈ నెల 9నుంచి ప్రారంభమవుతున్నందున పరీక్ష పత్రాలను పాఠశాల హెడ్‌మాస్టర్ల వద్ద భద్రపరచాలని ఎస్‌టీడబ్ల్యూటీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు జిల్లా విద్యాధికారి యాదయ్య కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష పత్రాలను మండల కేంద్రంలో భద్రపరచడం వల్ల ఆయా పాఠశాలలకు తీసుకెళ్లేందుకు సమయానికి ప్రశ్నాపత్రాలు అంద క విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. ప్రశ్నాపత్రాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద భద్రపరచాలని కోరారు. కార్యక్రమంలో భట్టారి వెంకటేశ్వర్లు, బాపు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రగతికి మూల స్తంభాలు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశ ప్రగతికి మూల స్థంభాల లాంటివారని, విద్యార్థి దశలో విద్యపై ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని మంచిర్యాల వివేకవర్ధిని పీజీ, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఊదరి చంద్రకాంత్ గౌడ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో విద్యార్థుల వీడ్కోలు పార్టీలో ఆయన మాట్లాడా రు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుప ర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్, రాజేష్, శ్రీలేఖ, సమీర్, చైతన్య, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

మందమర్రి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాధిత కు టుంబానికి ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు అందజేశారు. శ్రీపతి నగర్‌కు చెందిన వెంకటి తీవ్రఅనారోగ్యంతో మృతి చెందారు. పేదకుటంబం కావడంతో ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యం లో నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సమితి చైర్మన్ వెంకటేష్, సభ్యులు గోవిందుల శంకర్, సతీష్, గోషిక ప్రభాకర్, సముద్రాల శ్రీనివాస్, నవీన్, నందిపాటి రవి, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

కార్మిక సదస్సును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 8న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే కార్మిక సదస్సును విజయవంతం చేయాలని టీఎన్‌టీయుసీ ప్రధాన కార్యదర్శి మణిరాం సింగ్ కోరారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలను సవరించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినాదంతో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నారాయణ, జీవరత్నం, మల్లయ్య, ఎండీ పాషా, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత ఆలయ వార్షికోత్సవం

బెల్లంపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీలోని దుర్గామాత దేవాలయ 24వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకుడు రవిశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అఖండ దీపారాధన నిర్వహించి దుర్గామాతకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ నాయకుల సమావేశం

మందమర్రిరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్‌ప ల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బానోత్ నీలయ్య ఆధ్వర్యంలో జైపు జై భీమ్, జై సంవిధానం కార్యక్రమంలో భాగంగా సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో నిర్వహించే కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, కడారి జీవన్‌కుమార్, మాజీ సర్పంచులు కొమురయ్య, ఆసంపల్లి రాజయ్య, చంద్రయ్య, నంబయ్య, ఏనుగు తిరుప తిరెడ్డి, పెంచాల రాజలింగు, కొట్టె సంపత్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



సర్టిఫికెట్లతో విద్యార్థులు

జైపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని ఎస్టీపీపీ ఓపెన్ ఆడి టోరియంలో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా సింగరేణి జనరల్ మేనేజర్ కొండారెడ్డి శ్రీనివాసులు హాజరై టెస్టులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని జననిని అభినందించారు. ఈ ఘనత ఎస్టీపీపీ కరాటే శిక్షణ కేంద్రానికి గర్వకారణంగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ డీజీఎం పంతుల, కోచ్‌లు రాజనర్సు, శ్రీనివాస్, శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే దోహదం

దండేపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందని దండేపల్లి ఎస్సై తహసినోద్దీన్ అన్నారు. ఇటీవల జరిగిన కుంగ్ ఫూ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం దండేపల్లి పోలీసుస్టేషన్‌లో ఎస్సై అభినందించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థు లు చదువుతో పాటు క్రీడలు, కరాటేలో రాణించినప్పుడే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగు తున్న ఆగడాలు, అరాచకాలపై విద్యార్థులకు వివరిం చారు. విద్యార్థులు కరాటే నేర్చుకోవడమే కాకుండా ఇతరులకు నేర్పించాలన్నారు. కరాటే మాస్టర్ బచ్చల అంజన్నతో పాటు విద్యార్థులను ఎస్సై అభినందించారు.



కరాటేలో ప్రతిభకనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సై

తాగునీటి వసతి కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎర్మ పున్నం

కోటపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల వద్ద తాగునీటితో పాటు పబ్లిక్ టాయిలెట్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం ప్రజావాణిలో తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మయ్యలకు సోమవారం వినతిపత్రం అందించారు. వేసవి కాలం దృష్ట్యా కార్యాలయాలకువచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ప్రభుత్వ ఆసుపత్రి, వ్యవసాయ శాఖ, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద వసతులు ఏర్పాటు చేయాలని కోరారు.

రవీంద్రఖనిలో ప్యాసింజర్ హాల్టింగ్ ఇవ్వాలి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రవీంద్రఖని రైల్వే స్టేషన్‌లో బల్లార్ష-కాజీపేట ప్యాసింజర్ రైలు హాల్టింగ్ ఇవ్వాలని కోరుతూ మంచిర్యాల రైల్వే అధికారులకు బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు ఆరుముల్ల పోషం, బంగారు వేణుగోపాల్ మాట్లాడుతూ రవీంద్రఖని నుంచి పనుల నిమిత్తం కాజీపేట వరకు ప్రతీరోజు పెద్దఎత్తున ప్రయాణికులు వెళ్తారని తెలిపారు. సామాన్యులకు ఈరైలు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, హాల్టింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని తెలిపారు. అండమాన్ ఎక్స్‌ప్రెస్‌కు సైతం హాల్టింగ్ ఇవ్వాలని, లేని పక్షంలో దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని లోకోపైలెట్ల నిరసన

బెల్లంపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు లోకోపైలెట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ సాంబశివుడు మాట్లాడుతూ యాంటి లేబర్ పాలసీకి వ్యతిరేకంగా లోకోపైలెట్లతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. లోకోపైలట్లపై పనిఒత్తిడి పెంచుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రైల్వేశాఖ డీఏకు అనుకూలంగా కిలోమీటర్ అలవెన్సు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్మిక వ్యతి రేక విధానాలను వెంటనే నిలిపి వేయాలని లేని యెడల నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మీర, అగర్వాల్, లోకోపైలెట్లు పాల్గొన్నారు.



నెన్నెలలో శాశ్వత పందిళ్లపై బీర సాగు

కూరగాయల సాగుతో లాభాల పంట



వంగ సాగు

- ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు
- పంట మార్పిడితో రోజువారీ ఆదాయం
- సాగుకు ఉద్యానశాఖ ప్రోత్సాహం

నెన్నెల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలైన వరి, పత్తి తదితరాలు సాగుచేసి దిగు బడులు రాక నష్టపోతున్న రైతులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకుంటున్నారు. లక్షల పెట్టుబ డులు పెట్టి నష్టపోవడంకంటే రోజువారీ ఆదా యం లభించే కూరగాయల సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు, తెగుళ్ల దాడి ఇలా ప్రతికూల పరిస్థితు లతో సంప్రదాయ పంటలు నష్టాలు మిగులుస్తుండగా... కూరగాయలు మాత్రం సిరులుపండి స్తున్నాయని రైతులంటు న్నారు. ఆధునిక పద్ధతు లైన శాశ్వత పందిళ్లు, మల్చింగ్ విధానం, డ్రిప్ ఇరిగేషన్‌లతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ కూరగాయలు పండించి లాభాలు ఆర్జిస్తున్నారు. కాకర, బీర, వంగ, బెండ, టమాట, దోస, సోరకా య, పచ్చిమిర్చి, అనపకాయ, అలసంద, చిక్కుడు, గోరుచిక్కుడు లాంటి కూరగా యలతో పాటు తోటకూర, పాలకూర, చుక్కకూర లాంటి ఆకు కూరలను సాగు చేస్తున్నారు. కొందరు తమ పెరళ్లలో శాశ్వత పందిళ్లు వేసుకుని పూర్తిగా కూరగాయల సాగుకు మారిపోయారు. దీనికి తోడు కూరగాయల సాగుకు ప్రభుత్వం భారి రాయి తీలిచ్చి ప్రోత్సహిస్తున్నది. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటే లాభాలే దిగుబడుల వుతాయని అధికారులు అంటున్నారు.

● పెరిగిన డిమాండ్

ఆరోగ్య రీత్యా పట్టణాలు, గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరల వినియోగం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. మార్కెట్లో ఎంత ధరైన చెల్లించి తాజా కూరగాయలు కొంటున్నారు. ఒక్కోసారి కొన్ని కూరగాయలు.. కేజీ 120నుంచి 150 పలికిన సందర్భాలున్నాయి. సీజన్ ఏదైనా ఏడాదంతా కూరగాయలకు, ఆకుకూరలకు మంచి డిమాండ్ ఉంటోంది. దీంతో చాలా మంది రైతులు కూరగాయల సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. సంప్రదా య పంటలతో పోల్చుకుంటే కూరగాయలకు చీడ పీడలు, తెగుళ్ల బెడద అంతగా ఉండదు. పెట్టు బడి కూడా తక్కువగానే ఉంటుంది. తక్కువ కాలంలో చేతికందే హైబ్రీడ్ రకాలను ఎంపిక చేసు కుని సాగుచేయాలని అధికారులు సూచిస్తున్నారు. ముందు జాగ్రత్తలు పాటిస్తే కూరగాయల సాగు లో నష్టం ఉండదంటున్నారు. మార్కెట్ అవసరాల దృష్ట్యా డిమాండ్ ఉన్న కూరగాయను పండిస్తే, ఉపాధికి గ్యారంటీ లభిస్తుందని అంటున్నారు.



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న చిక్కుడు కాయ

● కొన్ని గ్రామాలు స్పెషల్

కూరగాయల సాగుకు జిల్లాలో కొన్ని గ్రామాలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. అక్కడి రైతులు ఏడాదంతా దశల వారీగా సీజన్‌ను బట్టి కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు. నెన్నెల మంలంలోని నెన్నెల, బొప్పారం, జోగాపూర్, గుండ్ల సోమారం, బెల్లంపల్లి మండలంలోని బూదకలాన్, బూదకుర్దు, చంద్రవెల్లి, పెర్కపల్లి, రంగపేట, ఆకెనపల్లి, భీమిని మండలంలో చెన్నాపూర్, మామిడిగూడ, పెద్దపేట, కన్నెపల్లి మండల కేంద్రతో పాటు జజ్జరవెల్లి, మెట్‌పల్లి, చెన్నూరు మండలంలోని కత్తరశాల, బుద్దారం, కిష్టం పేట, మందమర్రి మండలంలోని ఆదిల్‌పేట, మామి డిగట్టు, తాండూరు, భీమారం మండలంల్లోని పలు గ్రామాల్లో కూరగాయలను విరివిగా పండిస్తున్నారు.

● రోజువారీ ఆదాయం

ఇతర పంటలకు ఏడాదికి ఓసారి మాత్రమే ఆదా యం వస్తుంది. దీంతో రైతులు..

మిగతా 7లో

పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైనట్లు జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి మూల్యాంకనం ప్రారంభం కాగా క్యాంప్‌లో అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్స్ ఏడుగురు ఉండగా చీఫ్ ఎగ్జామినర్స్ 65 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్స్ 395 మంది, స్పెషల్ అసిస్టెంట్స్ 130 మంది ఉన్నారన్నారు. తొలిరోజు మొత్తం 7,280 పేపర్లను మూల్యాంకనం చేసినట్టు డీఈవో తెలిపారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై సురేష్

లక్షెట్టిపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట ఎస్సైగా గోపతి సురేష్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన పోచంపల్లి సతీష్ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఇంతకాలం హాజీపూర్‌లో ఎస్సైగా విధులు చేపట్టిన సురేష్ పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్సైని స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నెన్నెల తహసీల్దార్ సస్పెన్షన్

నెన్నెల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి అక్రమ పట్టా చేసిన మంచిర్యాల జిల్లా నెన్నెల తహసీల్దార్ సబ్బ రమేష్‌పై వేటు పడింది. ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిన్న వెంకటాపూర్ గ్రామంలో సర్వేనంబర్ 132లో శ్రావ్యరెడ్డి పేరిట ఉన్న రెండెకరాల భూమిని గంగారం గ్రామానికి చెందిన చిర్రం రమేష్ పేరిట అక్రమ పట్టా చేశారు. శ్రావ్యరెడ్డి బతికుండగానే మృతి చెందినట్లు రికార్డులు సృష్టించారు. అక్రమ పట్టా వ్యవహారం బయటకు పొక్కడంతో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపి బాధ్యులైన తహసీల్దార్‌తో పాటు ధరణి ఆపరేటర్ ఉదయ్‌ను ఉద్యోగంలో నుంచి తొలగించారు. కలెక్టరేట్‌లో ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న కైలాస్‌ను నూతన ఆపరేటర్‌గా నియమించారు. స్థానిక డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు సూచించారు. సోమవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆయన సూర్యనగర్‌లో కాలనీవాసులకు నేరాలపై అవగాహన కల్పించారు. కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత గంజాయి, బెట్టింగ్‌లకు దూరంగా ఉంచేలా వారి తల్లిదండ్రులు దృష్టి సారించాల న్నారు. డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ నేరమని తెలిపారు. ఎవరికైన సమస్య తలెత్తినప్పుడు వెంటనే వందనంబర్ ఫోన్‌చేయాలని సూచించారు.

గూడెంలో వైభవంగా పూర్ణాహుతి



గూడెం హనుమాన్ మందిరంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

దండేపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి కార్యక్రమంలో భాగంగా దండేపల్లి మండలం గూడెంలో అంజనేయస్వామి ఆయంలో సోమవారం పూర్ణహుతి హోమయజ్ఞ పూజలను వెభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు సత్యంస్వామి, చిరంజీవిస్వామి ఆలయంలో సుప్రభాతం, నిత్య పూజ, హోమం, పూర్ణహతి. బలిహరణ, మంగళ హరతి మంత్రపుష్ప ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహంచారు. హనుమాన్ దీక్షాపరులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో పెట్టి ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి

- అధికారులకు కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కోసం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. యాసంగి 2024-25 సంవత్సరానికి గాను గ్రేడ్ ఏ రకానికి 2,320 రూపాయలు, సాధారణ రకానికి 2,300 రూపాయలు మద్దతు ధర నిర్ణయించడం జరిగిందన్నారు.

వేసవి కాలం అయినందున కేంద్రాల వద్ద నీడ, తాగునీరు సౌకర్యాలు కల్పించడంతో పాటు ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. మాయిశ్చర్ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, మైక్రోమీటర్‌లు, గన్నీ సంచులు సమకూర్చుకోవాలన్నారు. కొనుగోలు వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలని, కొన్న వారికి రశీదు అందించాలని సూచించారు. గన్ని సంచుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 104 దొడ్డురకం, 90 సన్నరకం కేంద్రాలు, ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘాల ద్వారా 80 దొడ్డురకం, 39 సన్నరకం, మెప్మా ఆధ్వర్యంలో నాలుగు దొడ్డురకం, రెండు సన్నరకం కొనుగోలు కేంద్రాలతో మొత్తం 319 కొనుగోలు కేంద్రాలఏర్పాటు చేసేందుకు



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, డీఆర్‌డీవో కిషన్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, పౌరసరఫరాల మేనేజర్ శ్రీకళ, మహిల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రత్యేకదృష్టి సారిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్, జన్నారం, హాజీపూర్, భీమిని, మందమర్రి, మంచిర్యాల, క్యాతనపల్లి, రేండ్లగూడ, లక్షెట్టిపేట ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు వివిధ సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబందిత అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్‌కావేటర్ పట్టివేత

జన్నారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జన్నారం డివిజన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని బుట్టాపూర్ కోర్‌ఏరియా అటవీ ప్రాంతంలో అనుమతులు లేకుండా మొరం తవ్వుతున్న ఎక్స్‌కావేటర్‌ను పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా మొరం తవ్వుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఎక్స్‌కావేటర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా కోర్‌ఏరియాలో మొరం తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొమిరెడ్డి సత్తన్న

లక్షెట్టిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ న్యాయస్థానంలో న్యాయవాదులు లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ ఎన్నికలను సోమవారం నిర్వహించారు. అధ్యక్ష పదవికి కొమిరెడ్డి సత్తన్న, గాండ్ల సత్యనారాయణ పోటీ పడగా ఇద్దరికి సమానంగా ఓట్లు వచ్చాయి. అధ్యక్షుడి ఎన్నిక కోసం టాస్ వేయగా కొమిరెడ్డి సత్తన్న విజయం వరించింది. ఉపాధ్యక్షుడి ఎన్నిక కోసం వొజ్జల నళినీకాంత్, చుంచు తిరుపతి స్వామి పోటీ పడగా వొజ్జల నళినీకాంత్ గెలుపొందారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

కాసిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాసిపేట మండలంలోని బుగ్గగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడా లని కోరుతూ సామాజిక కార్యకర్త మేంద్రపు రాజన్న సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బుగ్గగూడెం (కనికలాపూర్) సర్వే నెంబరు 74/1లో 60 ఎకరాలు, 74/2లో 20 ఎకరాల 20 గుంటలు, 22/1లో 3 ఎకరాల 37 గుంటల ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేసి అక్రమంగా పట్టాలు చేసుకున్నారన్నారు. పంట రుణాలతో పాటు రైతు భరోసాలు పొంది ప్రభుత్వ ధనాన్ని కొల్లగొడుతున్నారన్నారు. వెంటనే దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములకు పట్టాలు చేసిన అధికారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగాల భర్తీకి నేడు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, కార్మిక ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా అర్హత నైపుణ్యం కలిగిన సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశాల్లో ఉద్యోగాల భర్తీ కోసం మంగళవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18-40 సంవత్సరాల వయస్సుతో పాటు అర్హతలు కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9440049937, 9440049861, 9440051452లో సంప్రదించాలని సూచించారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్ రాజు

గర్మిళ్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణ కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలని సిబ్బందికి డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్ రాజు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని భగవంత్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సమీక్షాసమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆరోగ్య వైద్యాధికారి హరీశ్‌రాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్య సేవల్లో మంచిర్యాల జిల్లా ముందుందని తెలిపారు. మాతాశిశు సంరక్షణ కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలని సూచించారు. వందశాతం టీకాలు ఇవ్వాలని, వ్యాధులు ప్రబలకుండ చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవికాలంలో వడదెబ్బ రాకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తల ను ప్రజలకు వివరించాలన్నారు. ఉపాధి హామీ పథ కం పని ప్రదేశాల్లో, రేషన్ షాపుల దగ్గర ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో 60మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి, మంచిర్యాల జిల్లా లీగల్ సొసైటీ మారం ఆర్పిత రెడ్డి, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరి, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, వైద్యులు రాము, రజిత, అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పావని, పద్మ, సులోచన, ఐసీడీఎస్ సూపర్ వైజర్, అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు, గర్భిణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సన్నబియ్యం నిధులు కేంద్ర ప్రభుత్వానివే..



గర్మిళ్ల రేషన్ షాపు వద్ద ప్రజలతో మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించే రేషన్ బియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని బీజేపీ నాయకుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. సోమవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా మంచిర్యాల పట్టణం గర్మిళ్లలోని రేషన్ దుకాణాన్ని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రధాని మోదీ ఉచితంగా ప్రజలకు రేషన్ బియ్యం అందిస్తున్నారని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పేరుతో తామే బియ్యం అందిస్తున్నామని ప్రజలను మోసం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక్క కిలో బియ్యం తన వాటా కింద ఇచ్చి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. మరో ఐదు సంవత్సరాల వరకు కేంద్రం ఉచితంగా బియ్యం అందిస్తుందని తెలిపారు. అనంతరం రేషన్ షాపుల వద్ద సమస్యలను పరిష్కరించాలని మంచిర్యాల తహసీల్దార్‌కు ఫోన్‌లో తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం, అశోక్, వర్ధన్, రాజ్‌కుమార్, సతీష్, నాగేశ్వర్‌రావు, శ్రీదేవి, శంకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను వాడవద్దు

- నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్

వేమనపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు నకిలీ పత్తి విత్తనాలను వాడవద్దని నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ సూచించారు. సోమవారం వేమనపల్లి గ్రామంలో పోలీసులు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు వాడకంతో భూమి సారం తగ్గి పోయి పంట దిగుబడి కూడా తగ్గుతుందని తెలి పారు. నకిలీ విత్తనాలు వాడితే పంటలు నష్టపోయినప్పుడు ప్రభు త్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం రాదన్నారు. ఒకవేళ రహస్యంగా నకిలీ విత్తనాలు వేశారని సమాచారం అంది తే వెంటనే అక్కడకు వెళ్లి పట్టుకుని చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్లైసిల్ విత్తనాలు వాడితే అనారోగ్య సమస్యలు వస్తాయని, పర్యావరణం దెబ్బతింటుందన్నారు. గ్లైసిల్ విత్తనాలు అమ్మినా, కొన్నా చట్ట ప్రకారం నేరమని తెలిపారు. మండల వ్యవసాయాధికారి వీరన్న మాట్లాడుతూ రైతులందరు లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొన్న వాటికి రశీదులు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో మా జీ సర్పంచ్ తోకల రాంచదంర్, రైతులు పాల్గొన్నారు.



వేమనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, వ్యవసాయాధికారులు